హైదరాబాద్ వార్త





# రేపే గోల్కొండ బోనాలు

- పచ్చికుండతో జగదాంబికకు తొలి బోనం
- కోటలోని అమ్మవారికి 9రోజులు 9 పూజలు
- నెలరోజుల పాటు బోనాల ఉత్సవాలు
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి పట్టువస్త్రాలు సమర్పణ



**మెహిదీపట్నం, జులై 05, ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు గోల్కొండలో రేపు ప్రారంభం కానున్నాయి. ఆశాడమాస మాస బోనాల ఉత్సవాలలో భాగంగా నిర్వహించే ఈ బోనాల ఉత్సవాలను భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ అమ్మవార్లకు బోనం, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. తెలంగాణలో బోనాల ఉత్సవాలు గోల్కొండ నుంచే ప్రారంభం అవుతండడంతో జగదాంబిక, మహంకాళి అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రుల చేతులమీదుగా పట్టు వస్త్రాలను సమర్పించడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ అన్ని ఏర్పాట్లను చేస్తుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విదంగా గోల్కొండ కోటలో నెల రోజుల పాటు బోనాల ఉత్సవాలు జరగనున్నాయి. ఆది, గురువాలలో 9 రోజుల పాటు 9 పూజలు నిర్వహిస్తుండడంతో భక్తులు లక్షలాదిగా పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఆశాషడమాసం అమావాస్య రోజున ప్రారంభమైన బోనాల ఉత్సవాలు ఆగస్టు 4న ముగుస్తాయి.

### పచ్చికుండతో అమ్మవార్లకు తొలి బోనం, భారీ తొట్టెల.

గోల్కొండ కోటలో కొలువైన జగదాంబిక అమ్మవారికి మొదటి బోనాన్ని లంగర్‌హౌస్ వాసులు పచ్చికుండతో సమర్పిస్తారు. 28 కులవృత్తుల ఆధ్వర్యంలో అమ్మవార్లకు రెండు పచ్చికుండల్లో నజర్‌బోనాలను చేసి ఒకటి జగదాంబిక అమ్మవారికి మరొకటి మహంకాళి అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీ. లంగర్‌హౌస్ చౌరస్తా వద్ద భారీ తొట్టెలకు రాష్ట్ర మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాదాయశాఖ తరుపున పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. భారీతొట్టెల ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల ఆటపాటలతో బడాబజార్, రిసాల బజార్ మీదుగా అమ్మవార్ల వద్దకు చేసుకొని భక్తు లు నజర్‌బోనాలను,పట్టువస్త్రాలను సమర్పి స్తారు.

### గోల్కొండ కోట మెట్లకు కుంకుమ, పసుపు సమర్పణ.

గోల్కొండ శ్రీజగదాంబిక మహంకాళి అమ్మవార్ల బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని వివిద ప్రాంతాలనుంచి కోటకు వచ్చిన భక్తలు మెట్లకు కుంకుమ, పసుపులను సమర్పించారు. ఆశాడమాసం అవాస్య రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మెట్లకు కుంకుమ, పసుపు పెట్టి అమ్మవార్లకు పంచామృతాలచే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### అమ్మవార్లాకు 9రోజుల, 9పూజలు.

బోనాల ఉత్సవాలలో భాగంగా జగదాంబిక, మహంకాళి అమ్మవార్లకు 9రోజుల పాటు 9పూజలు నిర్వహిస్తారు.

మొదటి రోజు (ఆదివారం) - పంచామృతాలతో పూజా కార్యక్రమాలు.

రెండవ రోజు (గురువారం) - అమ్మవార్లకు ఒడి బియ్యం, హోమం, బోనాల సమర్పణ

మూడవరోజు (ఆదివారం) - పలుబస్తీల నుంచి 25 తొట్టెలను తీసుకొచ్చి అమ్మవార్లకు సమర్పించడం.

నాలుగవరోజు (గురువారం) - అమ్మవార్లను పూలు, గాజులతో అలంకరించి నవధాన్యాలతో పూజా కార్యక్రమం.

ఐదవరోజు (ఆదివారం) - శాఖాంబరి అలంకరణతో పూజ.

ఆరవరోజు (గురువారం) - అమ్మవార్లకు కల్లు సాఖ, గుమ్మడికాయల సమర్పణ.

ఏడవరోజు (ఆదివారం) - అమ్మవార్లకు శాఖ కార్యక్రమం.

ఎనిమిదవరోజు (గురువారం) - 28 కుల వృత్తుల వారిచే శాంతి పూజలు, కల్లుసాఖ,

తొమ్మిదవరోజు (ఆదివారం) - నవధాన్యాలతో ఐదంస్తుల బోనం చేసి దేవదాసిచే కుంభహారతి.

వైభవంగా బోనాల ఉత్సవాలు - కె.అరవింద్ మహేష్ కుమార్ (శ్రీజగదాంబిక బోనాల ఉత్సవాల కమిటీ చైర్మన్)

గోల్కొండ కోట శ్రీజగదాంబిక మహంకాళి అమ్మవార్ల బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. బోనాల ఉత్సవాలలో రాష్ట్ర మంత్రులు పాల్గొని అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. నగరం నలుమూలల నుంచే కాకుండా జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది.

# నేడు జిహెచ్ఎంసి కౌన్సిల్ మీటింగ్

- మేయర్ అధ్యక్షతన జరగనున్న సమావేశం
- ఉదయం 10.30గంటలకు ప్రారంభం
- వ్యూహ ప్రతివ్యూహాల్లో అధికార విపక్ష పార్టీలు
- మేయర్ రాజీనామాకు బిఆర్ఎస్ పట్టుబట్టే అవకాశం



కౌన్సిల్ సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసిపాలకమండలి సమావేశం నేడు జరగనుంది. ఉదయం 10.30గంటలకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అధ్యక్షతన సమావేశం నిర్వహించనుంది. ఈనేపథ్యంలో సమావేశానికి సంబంధించి అధికార, విపక్ష పార్టీలకు చెందిన కార్పొరేటర్లు వ్యూహ,ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. ముఖ్యంగా అధికారపార్టీ కాంగ్రెస్‌కు కౌన్సిల్‌లో కాంగ్రెస్‌కు 19మంది కార్పొరేటర్లే ఉండగా.. అధికారులను పలు అంశాల్లో నిలదీసి ఇరకాటంలో పెట్టేందుకు విపక్ష పార్టీలైన బిఆర్ఎస్, బిజెపిల కార్పొరేటర్లు వ్యూహం సిద్దం చేసుకున్నారు. ఈసమావేశానికి మొత్తం 148 ప్రశ్నలు రాగా ,అందులోంచి కేవలం 25 ప్రశ్నలను మాత్రమే సభలో ప్రస్తావించేందుకు మేయర్ గద్వాల విజయలక్ష్మీ ఎంపిక చేసినట్లు తెలుస్తుంది. ముఖ్యంగా వర్షాలు, సహాయక చర్యలు, పారిశుద్యం, దోమల బెడద, సీజనల్ వ్యాధులు, జిహెచ్ఎంసి ఆర్థికసంక్షోభం, టాక్స్ కలెక్షన్, టౌన్‌ప్లానింగ్ వంటి అంశాలపై అధికారులను నిలదీసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. అలాగే బిజెపి కార్పొరేటర్ల జిహెచ్ఎంసి పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపుపై నిలదీసే అవకాశం ఉంది. అలాగే ఓల్డ్‌సిటీలోని సమస్యలతో పాటు కార్పొరేటర్ల బడ్జెట్‌పై మజ్లిస్ కార్పొరేటర్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా శానిటేషన్, నాలాలపూడిక తీత, దోమల నివారణ వంటి అంశాలపై ఎంఐఎం కార్పొరేటర్లు అధికారులను నిలదీసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

### మేయర్ రాజీనామాకు బిఆర్ఎస్ పట్టుబట్టే అవకాశం ..

తమపార్టీ నుంచి మేయర్‌గా ఎన్నికై కాంగ్రెస్‌లో పార్టీలో చేరిన మేయర్ విజయక్ష్మీ, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డిల రాజీనామాకు బిఆర్ఎస్ కార్పొరేటర్లు డిమాండ్ చేసే అవకాశం కనిపిస్తుంది. అలాగే ఆరుగ్యారెంటీల అమలు, డబుల్ బెడ్‌రూం పంపిణీ, కళ్యాణలక్ష్మీ ,షాదీ ముభారక్ 4వేల పెన్షన్ వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. ఈనేపథ్యంలోనే శుక్రవారం జిహెచ్ఎంసి పరిధిలోని ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీ కార్పొరేటర్లలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్,మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసంద్భంగా ప్రజా సమస్యలు, నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధిపనులపై ముక్తకంఠంతో ప్రశ్నించాలని నిర్ణయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7నెలలు దాటినా ఆరుగ్యారెంటీల అమలులో భాగంగా మహిళలకు 2500 ఆర్థిక సాయం, 4వేల పెన్షన్ పెంపు, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్దిదారులకు తులం బంగారం పంపిణీ, డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం, పంపిణీ వంటివి అమలు చేయలేదని కావున సంక్షేమ కార్యక్రమాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. అలాగే పారిశుద్ద నిర్వాహణ, నాలాల పూడిక తీత వంటిఅంశాలపై ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

### పార్టీలవారీగా బలాబలాలు..

జిహెచ్ఎంసిలో మొత్తం 150మంది కార్పొరేటర్లు ఉండగా అందులో నాలుగు డివిజన్లు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. రెండుస్థానాల్లో కార్పొరేటర్లు మరణించగా ..ఓకార్పొరేటర్ ఎమ్మెల్సీగా, మరో కార్పొరేటర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గుడిమల్కాపూర్‌నుంచి బిజెపి తరపున కార్పొరేటర్ ఎన్నికైన దేవర కరుణాకర్ 2023 జనవరిలో అనారోగ్యంతో మరణించారు. అలాగే ఎర్రగడ్డ డివిజన్ నుంచి విజయం సాధించిన ఎంఐఎం కార్పొరేటర్ షాహిన్‌బేగం చనిపోయారు. మోహిదీపట్నం కార్పొరేటర్‌గా ఉన్న మాజీద్ హుస్సేన్ (ఎంఐఎం) నాంపల్లి శాసన సభ్యుడిగా ,రామ్నాసపుర కార్పొరేటర్ మహ్మద్ ముబీన్ బహదూర్‌పురా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో 150 మందిలో నాలుగు ఖాళీలు ఏర్పడగా ప్రస్తుతం 146మంది సభ్యులు ఉన్నారు. అందులో అధికార కాంగ్రెస్‌కు ।19, బిఆర్ఎస్-47,బిజెపి -39, ఎంఐఎం 41మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరితో పాటు 5మంది లోక్‌సభ ఎంపిలు, 5గురు రాజ్య సభ సభ్యులు, 24మంది ఎమ్మెల్యేలు, 15మంది ఎమ్మెల్సీలు సమావేశానికి హాజరుకానున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ



లంగర్‌హౌస్ మందులబస్తీలోని అంగవన్‌వాడి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్.

**మెహిదీపట్నం, జులై 5, ప్రభాతవార్త :** కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్ మందులబస్తీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారుల సంఖ్య ఎందుకు తక్కువగా ఉందంటూ టీచర్‌ను అడగడంతో పాటు కొత్త సెలబస్ ఏవిదంగా ఉందంటూ చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. కొదిసేపు చిర్నారులతో ముచ్చటించి పాఠాలను బోర్డుపై రాయించారు. విషయం తెలుసుకున్న స్థానిక మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు మాతంగి రమేష్, బిజెపి కార్వాన్ నియోజవకర్గ ఎలక్షన్ ఎఫైర్స్ కమిటీ సభ్యులు జెన్న సుధాకర్‌లు అక్కడికి చేరుకొని లంగర్‌హౌస్ డివిజన్ పలుబస్తీలలో నెలకొన్న సమస్యలతో పాటు స్థానిక విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెల్లారు. కార్వాన్ నియోజకవర్గంలోని హైస్కూల్ వరకు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి కానీ ఇంటర్ చదువుకోవడానికి కళాశాల మాత్రం లేదన్నారు. ఇంటర్ చదవడానికి విద్యార్థులు ప్రైవేటు కళాశాలలను ఆశ్రయించాల్సి వస్తుంది దీంతో పేద విద్యార్థులు మాత్రం 10వరకు చదివి ఇంటర్ చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## 7న మహాకాళీ అమ్మ వారి ఘటోత్సవాలు

-భక్తుల కోసం అన్ని రకాలుగా ముందస్తు ఏర్పాట్లు : ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి



శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో వివరాలు వెల్లడిస్తున్న ఈ ఓ, దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు

**బేగంపేట జులై 5 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి బోనాల జాతరలో భాగంగా ఈ నెల 7వ తేదీ నుంచి ఘటోత్సవాలు ప్రారంభమ వుతాయని, దేవాలయ కార్యనిర్వ హణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆనువంశిక ధర్మకర్త సురిటి కామేష్,ప్రధాన అర్చకులు రామతీర్ధ శర్మలతో కల్సి ఆయన మాట్లా డారు. 7వతేదీ ఆదివారం మధ్యాహ్నం అమ్మ వారి ఘటం అలంకరణ సామాగ్రిని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆలయ అనువంశిక ధర్మకర్తలకు అందిస్తారని, దీంతో ఉత్స వాలు ప్రారంభమవుతాయని చెప్పారు.కర్బలా మైదానం ప్రాంతంలో అమ్మ వారి ఘటం అలంకరణ పూర్తి చేసుకుని సాయంత్రం మేళతాళాలు,భక్తుల నృత్యాలు కోలాటాలతో ఘటం రాత్రికి దేవాలయానికి చేరుకుంటుందన్నారు. ఘటో త్సవాల్లో భాగంగా సోమవారం నుంచి 19వ తేదీ వరకు ప్రతి రోజు ఆయా ప్రాంతాల్లో భక్తులకు ఘటం దర్శనం ఇస్తుందని చెప్పారు.

### 21న బోనాలు 22న రంగం......

బోనాల ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21వ తేదీ ఉదయం గం 3.30లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మ వారికి బంగారు బోనం సమర్పిస్తారని, 4గంటలకు మహాహారతి అనంతరం సాధారణ భక్తులకు దర్శనం ప్రారంభమవుతుందని చెప్పారు. 22వ తేదీన ఉదయం గం 8.30నిలకు రంగం కార్యక్రమం ఉంటుందని అందులో అవివాహిత మహిళ అమ్మ వారిని ఆవహించగా భవిష్యవాణి విన్పిస్తుంద న్నారు.ఆ తర్వాత గం 10లకు అంబారీ ఊరేగింపు ఉంటుందన్నారు.ఆదివారం ,సోమవారం రాత్రి ఫలహార బండ్ల ఊరేగింపు ఉంటుందన్నారు.బోనాల ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఆయా శాఖల అధికారులతో కల్సి అన్ని రకాలైన ముందస్తు జాగ్రత్త ఏర్పాట్లు చేస్తున్నామని ఈ ఓ తెలిపారు.



టి20 వరల్డ్ కప్ గెలిచిన అనంతరం హైదరాబాద్‌కు వచ్చిన క్రికెటర్ సీరాజ్‌కు స్వాగతి పలుకుతున్న అభిమానులు

## కుమారి ఆంటీ ఫుడ్‌స్టాల్‌కు నటుడు సోనూసూద్

-మహిళా సాధికారతకు ఉదాహరణ కుమారి ఆంటీ

**గచ్చిబౌలి, జూలై 5 ప్రభాతవార్త** మాదాపూర్‌లో రోడ్‌సైడ్ ఫుడ్‌స్టాల్ ఏర్పాటు చేసి సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారిన కుమారీ ఆంటీ ఫుడ్‌స్టాల్‌ను శుక్రవారం ప్రముఖ నటుడు సోనూసూద్ సందర్శించారు. సోనూసూద్ ప్రధాన పాత్రలో నిర్మితమైన ఫతే సినిమా ప్రమోషన్ కోసం నగరానికి వచ్చిన సోనూసూద్ మాదాపూర్‌లోని ఐటిసి కోహినూర్ పక్కన ఉన్న కుమారీ ఆంటీ ఫుడ్‌స్టాల్‌కు వచ్చి సందడి చేశారు. కుమారీ ఆంటీ ఫుడ్‌స్టాల్‌కు నటుడు సోనూసూద్ వచ్చిన విషయం తెలుసుకున్న అభిమానులు పెద్దఎత్తున తరలిరావడంతో కుమారీ ఆంటీ ఫుడ్‌స్టాల్ మరోసారి సందడిగా మారింది. సోనూసూద్ తన ఫుడ్‌స్టాల్‌కు రావడంతో కుమారి ఆంటీ సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కుమారీ ఆంటీతో సరదాగా మాట్లాడిన సోనూసూద్ ఫుడ్‌స్టాల్‌లో దొరికే వంటకాల వివరాలు, వాటి ధరలను అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల నాన్ వెజ్, వెజిటేరిజన్ వంటకాలు అందుబాటులో ఉంటాయని కుమారీ ఆంటీ చెప్పగా, తాను వెజిటేరిజన్ అని సోనూసూద్ చెప్పారు. తనకు ఏమైనా డిస్కౌంట్ ఉంటుందా అని సరదాగా ప్రశ్నించగా, సోనూసూద్‌కు ఉచితంగా వడ్డిస్తానని కుమారీ ఆంటీ సమాధానం ఇచ్చింది. అనంతరం సోనూసూద్ కుమారీ ఆంటీకి భోజనం వడ్డించి, సత్కరించారు. ఈ సందర్భంగా సోనూసూద్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు ఉదహారణ కుమారీ ఆంటీ అని ప్రశంసించారు. భవిష్యత్తులో కుమారీ ఆంటీకి ఏ సహాయం కావాలన్నా చేస్తానని హామీ ఇచ్చారు.

## కోర్టులచుట్టూ తిరగలేకపోతున్నా... నాకు న్యాయం చేయాలి

-చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలకు జెరూసలెం మత్తయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్,జూలై 5,ప్రభాతవార్త:** పదేళ్లుగా కోర్టులచుట్టూ తిరుగుతూ విసిగిపోతున్నానని తనకు న్యాయం చేయాలని జేరుసలేం మత్తయ్య ఏపి సిఎం చంద్రబాబు, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డిలను విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటుకు నోటు కేసుతోపాటు మరో నాలుగు కోసుల్లో 2015నుంచి నేటివరకు కోర్టుల చుట్టూ తిరుగుతున్నానని ,కోర్టు ఖర్చులకు సైతం డబ్బులు లేవన్నారు. నేడు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం అవుతున్న నేపథ్యంలో తనఅంశాన్ని చర్చించి తనకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో న్యాయ పోరాటం చేసానతమని మత్తయ్య పేర్కొన్నారు.

## వీధి దీపాల నిర్వాహణలో అశ్రద్ద వద్దు

-జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఆమ్రపాలి తదితరులు

**హైదరాబాద్, జూలై 5,ప్రభాతవార్త:** వీధిదీపాల నిర్వాహణలో అశ్రద్ద వహించవద్దని జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట అన్నారు. ఈమేరకు శుక్రవారం తనఛాంబర్‌లో ఈఈఎస్ఎల్ ప్రతినిధులు, అడిషనల్ కమిషనర్‌లతో వీధి దీపాల నిర్వాహణపై సమీక్షించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాత్రి సమయంలో వీధిదాపాలు వెలగకపోతే ప్రజలు ఇబ్బందులు పడతారని ,వెంటనే స్ట్రీట్‌లైట్ ఏర్పాటు చేయాలని అదేశించారు. సీటీలో డార్క్‌స్పాట్ లేకుండా చర్యలు తీసుకోవాలని వర్షాకాల నేపథ్యంలో వెంటనే మరమ్మత్తులు చేసి చీకటి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నిర్దేశించిన ప్రకారం బఫర్ స్టాక్ ఉండేలా చర్యలు తీసుకోవాలని అగ్రిమెంట్ ప్రకారం అన్ని సమకూర్చుకోవాలని ,లేనిపక్షంలో ఏజెన్సీపై చర్యలు తప్పవన్నారు.బోనాల పండగ సందర్భంగా దేవాలయాల వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా అదనపు దీపాలు ఏర్పాటుకు చేయాలని మేయర్ సూచించారు. ఈసమావేశంలో అడిషనల్ కమిషనర్ ఎలక్ట్రిసీటీ సత్యనారాయణ, ఈఈ మమత, ఇచార్జ్ ఎస్ఈ సంతోష్, ఏఈ దివ్య తదితరులు పాల్గొన్నారు.

## ఖాజాగూడలో గ్యాస్ లీకేజీతో మంటలు

-తండ్రి, కుమారుడికి తీవ్ర గాయాలు



గ్యాస్ లీకేజీతో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సత్యనారాయణ ఇళ్లు

**గచ్చిబౌలి, జూలై 5 ప్రభాతవార్త** ఇంట్లోని వంట గదిలో గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న తండ్రి, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖాజాగూడలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... ఐటి కారిడార్ పరిధిలోని ఖాజాగూడ గ్రామంలో సీహెచ్.సత్యనారాయణ(53) తన భార్య, ఇద్దరు కుమారులు, కోడళ్లు, వారి పిల్లలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం సత్యనారాయణ భార్య తాళ్లమ్మ, చిన్న కుమారుడు సాయిచరణ్, చిన్న కోడలు బయటకు వెళ్లగా, ఇంట్లో సత్యనారాయణతో పాటు పెద్దకుమారుడు నర్సింగరావు(30), అతని భార్యలు ఉన్నారు. ఉదయం 7.30 గంటల ప్రాంతంలో సత్యనారాయణ కోడలు ఇంట్లోని హాల్‌లో కూరగాయలు కట్ చేస్తుండగా, వంటింట్లో నుంచి గ్యాస్ వాసన వచ్చింది. దీంతో గ్యాస్ లీకేజీని చెక్ చేసేందుకు సత్యనారాయణ వంటింట్లోకి వెళ్లాడు. రెగ్యులేటర్‌ను పరిశీలిస్తుండగా అప్పటికే గ్యాస్ లీక్ కావడం, దేవుడి గదిలో ఉన్న దీపం కారణంగా మంటలు వ్యాపించాయి. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడడంతో సత్యనారాయణ మంటల్లో చిక్కుకోగా, ఇంట్లోనే ఉన్న కుమారుడు నర్సింగరావు తండ్రిని కాపాడేందుకు ప్రయత్నించగా, అతనికి మంటలు అంటుకున్నాయి. మంటల నుంచి తప్పించుకునేందుకు సత్యనారాయణ మొదటి అంతస్థు నుంచి భవనం కిందకు దూకాడు. కోడలు అరుపులతో స్థానికులు చేరుకొని సత్యనారాయణ, నర్సింగరావును ఇంట్లో నుంచి బయటకు తీసుకువచ్చారు. మంటలు ఇళ్లు మొత్తం వ్యాపించగా, అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మంటల కారణంగా తీవ్ర గయాలైన సత్యనారాయణ, నర్సింగరావులను అపోలో డిఆర్‌డిఓ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సత్యనారాయణకు 80శాతం, నర్సింగరావు 60శాతం గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సత్యనారాయణ ఎలక్ట్రిసిటీ ఉద్యోగి కాగా, కుమారుడు నర్సింగరావు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



# అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న మైనంపల్లి : బిఆర్ఎస్


విలేకరుల సమావేశంలో పాల్గొన్న బిఆర్ఎస్ కార్పొరేటర్లు, ఇతర నాయకులు

**ఉప్పల్, మల్కాజిగిరి, జులై 5 ప్రభాతవార్త:** మల్కాజిగిరిలో అభివృద్ధి పనులను అడ్డుకుంటూ కొత్త సంస్కృతిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెరపైకి తీసుకువస్తున్నారని మల్కాజిగిరికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు, కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్లు అన్నారు. ఇటీవల మౌలాలి ఆర్టీసీ కాలనీలో ప్రజాసమస్యల పరిష్కారంకోసం అధికారులతో కలిసి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వెళ్తే కొంతమంది కాంగ్రెస్ నాయకులను ఉసిగొల్పి ఎమ్మెల్యే ను అడ్డుకోవడం వారు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సీనియర్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి , రావుల అంజయ్య, జే ఏసీ వెంకన్న, ఉపేందర్ రెడ్డి, ఉద్యమ నాయకులు ఉస్మాన్, జీకే హనుమంత రావు మధుసూదన్ రెడ్డి, చిందం శ్రీనివాస్, వరుణ్ తేజ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాజ్గిరి ప్రజలు మర్రి రాజశేఖర్ రెడ్డిని ఓట్లు వేసి గెలిపించారన్నారు. మల్కాజ్గిరి అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కానీ కొంతమంది అడ్డుపెట్టుకొని అభివృద్ధి పనులు చేయవద్దని అధికారులను ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అధికారులు కూడా అధికార పార్టీ నాయకుల మాటలు విని వారికి వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. దిగజారుడు రాజకీయాలు మానివేసి మల్కాజిగిరి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. గతంలో మౌలాలి ఆర్టీసీ కాలనీలో పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధికారులను కలిసి విన్నపించాలని గుర్తు చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు చేయాలే తప్ప ఎన్నికల అనంతరం ఓడిపోయానని అక్కస్సుతో అభివృద్ధి పనులను జరగకుండా అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నిజంగా మైనంపల్లి హనుమంతరావు గారికి మల్కాజ్గిరి అభివృద్ధి పై చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధికి సహకరించాలని కోరారు. అధికారులు ఇప్పటికైనా చెప్పుడు మాటలు విని పనులు చెయ్యకుంటే మల్కాజిగిరి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ప్రజల పన్నుల తో జీతాలు తీసుకుంటున్న అధికారులు ఎవ్వరికి చుట్టం కాదన్నారు. రాజకీయపరంగా కొంతమంది తమతో మాట్లాడడానికి భయభ్రాంతులకు గురవుతు న్నారని, ఇప్పటికైనా మల్కాజిగిరి అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని హితవు పలికారు.

## పచ్చదనం పెంపొందించండి: సబితారెడ్డి


మహిళలతో కలిసి మొక్కలు నాటిన సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 5 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లో పచ్చదనం పెంపొందించాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కార్పొరేషన్‌లోని మీర్‌పేట్ మంత్రాల చెరువు వద్ద శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సబితా రెడ్డి స్థానిక మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్‌చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, అధికారులు, పలువురు కార్పొరేటర్లు తదితరులతో కలిసి చెరువునందు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో విరివిగా మొక్కలు నాటి హరితమయం చేయాలని సూచించారు. నాటిన మొక్కలను విధిగా సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, డిఇఇ వెంకన్న, ఎఇఇ శ్రీనివాసులు, ఎఫ్ఆర్ఓ సుధీర్, కార్పొరేషన్ రెవెన్యూ ఆఫీసర్ అంజన్ రెడ్డి, బిఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, కార్పొరేషన్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు : కార్పొరేటర్ సునీతరాముయాదవ్

**మల్కాజిగిరి, జులై 5 ప్రభాతవార్త :** అమ్మవారి బోనాల జాతరకు ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా చర్యలు తీసుకోవాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ శానిటేషన్, రాంకీ, ఇతర అధికారులకు సూచించారు. ఈ నెల 28న జరగనున్న బోనాల వేడుకలు దృష్టిలో పెట్టుకొని శుక్రవారం ఆమె కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని సుమారు 30 నుంచి 40 అమ్మవారి ఆలయాలు ఉన్నాయని ఆలయాలు వాటిని శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి పారిశుధ్య సూపర్వైజర్ నాగరాజు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సిఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరం : ఎం. పరమేశ్వర్‌రెడ్డి


సిఎం సహాయనిధి ఎల్ఓసి పత్రం అందజేస్తున్న ఎం.పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, జూలై 5 ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి పథకం నిరుపేదలకు ఒక వరంలాంటిదని ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్ డివిజన్‌కు చెందిన జి.కోదండరావుకు అనారోగ్య సమస్యతో ఇబ్బంది పడుతుండడంతో స్థానికుల ద్వారా విషయం తెలుసుకుని సిఎం సహాయనిధి పథకం కింద చేయూత అందించారు. అతనికి రూ.5లక్షల ఎల్ఓసి పత్రం మంజూరు చేయించి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు తగు చేయూత అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సి.రఘుపతిరెడ్డి, కొంపల్లి బాలరాజు, ఆగంరెడ్డి, ఈగ అంజయ్య, అంజనేయులు, ఎన్.మహేందర్, కావలి రాము తదితరులు పాల్గొన్నారు.

## అమావాస్య సందర్భంగా చంపాపేటలో అన్నదానం

**సైదాబాద్, జులై 5 ప్రభాతవార్త:** అమావాస్య నాడు అన్నప్రసాద వితరణ చేయడంవల్ల పుణ్యఫలం దక్కుతుందని శ్రీమాత అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటీ చైర్మన్ భగవన్ అన్నారు. శుక్రవారం అమావాస్య సందర్భంగా చంపాపేటలోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయం ఎదురుగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ మాట్లాడుతూ గత 14 మాసాలుగా ప్రతి అమావాస్య రోజు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి ముదిరాజ్, సుశీల్ కుమార్, సంతోష్, ప్రవీణ్, వెంకటేష్, చింటూ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు సహకరిస్తాం : చింతల



ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కృష్ణను సన్మానిస్తున్న సురేంద్రనాథ్‌యాదవ్

**ఎల్.బి.నగర్, జులై 5 ప్రభాతవార్త :** శాంతి భద్రతల విషయంలో తాము పోలీసులకు సహకరిస్తామని బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సుధీర్‌కృష్ణను చింతల ఆధ్వర్యంలో బిజెపి నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగోల్ డివిజన్‌లో అన్ని కాలనీలలో పెట్రోలింగ్ పెంచాలని, డివిజన్‌లో చైన్ స్నాచింగ్‌లను అరికట్టాలని, యువకులు చెడు అలవాట్లకు పోకుండా వాటిని అరికట్టాలని ఇన్‌స్పెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వస్పరి మల్లేష్, రావుల శ్రీనివాస్, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

## శివ శంకర మహమ్మాయి ఆలయంలో ఎంపి ఈటల రాజేందర్ పూజలు


శివ శంకర మహమ్మాయి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపి ఈటల

**ఉప్పల్, జూలై 5 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని శ్రీ శివ శంకర మహమ్మాయి ఆలయంలో జేష్ట మాస అమావాస్య సందర్భంగా శ్రీ మహమ్మాయి దేవి ప్రత్యేక అలంకరణ, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ కమిటి చైర్మన్ ఉప్పోజి బల్వంతాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, రాష్ట్ర విశ్వ బ్రహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటచారి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర మహిళామోర్చ అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ శివ శంకర మహమ్మాయి ఆలయ అభివృద్దికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆలయంలో భక్తులకు వివిధ సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఆలయం మరింత వృద్ది సాధించాలని, ప్రజలకు మరింత మేలు జరుగాలని ఆయన అకాంక్షించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. భక్తులతో కలిసి ఈటల రాజేందర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ఉప్పోజి రాజు, రాజగోపాలచారి, శ్రీనివాస్, మధు, పల్లెర్ల గోపి, చోల్లేటి బ్రహ్మచారి, పురుషోత్తంచారి, శ్రీనివాస్, శ్రీధర్‌రాజు, మల్లేష్‌చారి, చంద్రమౌళి, బిజెపి నేతలు శామీర్‌పేట ధర్మారెడ్డి, హనుమంతరెడ్డి, మార్నెని ఫణీందర్, బొంగు రమేష్‌గౌడ్, వాకిటి బుచ్చిరెడ్డి, ఏసూరి యాదగిరి, బజారు జగన్‌గౌడ్, అనిల్‌రెడ్డి, దువ్వాల రమేష్, ప్రకాష్‌రాజు, అంజిరెడ్డి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సమాజ సంక్షేమ పరిషత్‌కు నిధులు కేటాయించాలి

**ఎల్.బి.నగర్, జులై 5 ప్రభాతవార్త:** న్యాయమైన కోరికలను వెంటనే పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బ్రాహ్మణ స్త్రీ శక్తి సభ్యులు పోస్ట్‌కార్డ్స్ ఉద్యమాన్ని చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ బ్రాహ్మణ స్త్రీ శక్తి సభ్యులు సమావేశమై బ్రాహ్మణ సమాజ సంక్షేమ పరిషత్ పథకాల గురించి చర్చించారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న విదేశీ విద్యా రుణాల గురించి, ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పోస్ట్‌కార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టామని టిబిఎస్ఎస్ ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు, స్త్రీశక్తి వ్యవస్థాపక అధ్యక్షురాలు తాడికొండ అనురాధ పేర్కొన్నారు. పరిషత్ నిధులు వెంటనే మంజూరు అయ్యేవిధంగా ముఖ్యమంత్రి, ఐటీశాఖ మంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలని పోస్ట్‌కార్డు ద్వారా విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్త్రీశక్తి సభ్యులు వి.రాజేశ్వరి, ప్రత్యూషహరి, జె.శ్రీలక్ష్మి, కె.సీతాకుమారి, డి.అరుణ, ఎం.సత్యవతి, జె.కళ్యాణి, ఎన్.రాధిక, కె.రాజలక్ష్మి, సి.శిరీష, ఎ.మాధవాయి, వి.శ్రీలత, ఎ.సారిక, శ్రావణి, రుక్మిణి పాల్గొన్నారు.

## ఇంటర్‌నేషనల్ వైశ్య పెడరేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం

**రామంతాపూర్, జూలై 5 ప్రభాతవార్త :** ఇంటర్‌నేషనల్ వైశ్య పెడరేషన్ జిల్లా కమిటి, ట్రైకలర్ ఆసుపత్రి అంబర్‌పేట ఆధ్వర్యంలో శుక్రవారం రామంతాపూర్‌లోని నల్ల పోచమ్మ ఆలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఐవియఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త, సెంట్రల్ వర్కింగ్ ప్రసిడెంట్ గంజి రాజమౌళిగుప్త, రాష్ట్ర కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్‌గుప్త, ఆధ్యాత్మిక కమిటి చైర్మన్ బోనగిరి శ్రీనివాసులుగుప్త, రామంతాపూర్ అధ్యక్షుడు సంబు పాండయ్యగుప్త, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రమేష్‌గుప్త, కోశాధికారి బోనగిరి శ్రవణ్‌కుమార్‌గుప్త, ఉప కోశాధికారి పూరే నగేష్‌గుప్త, ఐవిఎఫ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు విశ్వనాధ సుజాత, సంబు జయమ్మ, బోనగిరి లావణ్య, గార్లపల్లి నాగమణి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జేష్ఠ అమావాస్య సందర్భంగా ప్రతినెల అమ్మవారి ఆలయంవద్ద అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోగులకు తమ వంతు చేయూత అందిస్తున్నామని, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సహకారం అందిస్తున్నామని తెలిపారు. అంతకు ముందు రామంతాపూర్‌లోని బాల బారతి స్కూల్‌లో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఐవిఎఫ్ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు

**సైదాబాద్, జులై 5 ప్రభాతవార్త:** డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి అన్నారు. సింగరేణి వాంబే క్వార్టర్స్, ఎస్ఎన్‌రెడ్డి కాలనీలో డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులతో కలిసి సమస్యను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని డిజిఎం సరిత, మేనేజర్ రమ్యలకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు కృష్ణారెడ్డి, సత్యనారాయణ, పురుషోత్తం, భరత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు : పాండు

**ఎల్.బి.నగర్, జులై 5 ప్రభాతవార్త:** ఎంతమందిని అరెస్టు చేసిన విద్యార్థి ఉద్యమాన్ని ఆపలేరని రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్‌వి అధ్యక్షుడు పాండుగౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అక్రమ అరెస్టులు ఆపాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్‌వి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం టిజిపిఎస్ సి కార్యాలయం ముట్టడికి వెళ్లే ప్రయత్నం చేసిన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పాండుగౌడ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నాయకులు ఎలిమినేటి ప్రశాంత్ తదితరులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ ఎన్ని అరెస్టులు చేసిన ఉద్యమం ఆగదని విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామన్నారు. రాష్ట్రంలో విద్యార్థి సమస్యలను గాలికి వదిలేసిన రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థి లోకం తగిన రీతిలో బుద్ధి చెబుతుందన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : సబితారెడ్డి


సమస్యలను పరిశీలిస్తున్న సబితాఇంద్రారెడ్డి

**ఎల్.బి.నగర్, జులై 5 ప్రభాతవార్త :** కాలనీలో ఉన్న సమస్యలు ప్రణాళిక బద్ధంగా పరిష్కరిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్‌డివిజన్ శంకర్‌నగర్ బస్తీలో శుక్రవారం సబితారెడ్డి పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ పక్కన వున్న గ్రేవ్‌యార్డ్‌లో కొంతమంది ఆకతాయిలు కూర్చొని గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై కాలనీవాసులకు ఇబ్బంది కలిగిస్తున్నారని కాలనీవాసులు సబితమ్మ దృష్టికి తీసుకువెళ్లారు. కాలనిలో రోడ్స్, విద్యుత్ స్తంభాలు, మహిళా భవనం, త్రాగు నీటి సమస్య వున్నదని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. స్థానికులు చెప్పిన సమస్యలను అధికారులతో చర్చించి త్వరలోనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాత, శానిటేషన్ ఇంచార్జ్ నీలిమ, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షులు ఆకుల అరవింద్ కుమార్, కొండల్‌రెడ్డి,ధర్పల్లి అశోక్, ఇంటూరి అంకిరెడ్డి, కేశవరెడ్డి, సాలమ్మ, బాల్‌రాజ్‌గౌడ్, రమేష్‌గౌడ్, కిషోర్, శ్యామల, వుత్తుపల్లి శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, ప్రత్యుష్, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్ బైపాస్ రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగింపు


రామంతాపూర్ బైపాస్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

**రామంతాపూర్, జూలై 5 ప్రభాతవార్త :** రామంతాపూర్ బైపాస్ రోడ్డులో శుక్రవారం మున్సిపల్ అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. ఉప్పల్ సర్కిల్ డిసి అంజనేయులు ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారి వెంకటరమణ, టిపిఎస్ సురేష్, ఇతర సిబ్బంది పోలీసుల సహకారంతో అక్రమణలు తొలగించారు. రామంతాపూర్ గణేష్‌నగర్‌నుంచి బైపాస్ రోడ్డు వరకు, అక్కడి నుంచి రామంతాపూర్ టివి కాలనీ వరకు పలు అక్రమణలు తొలగించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ ఫుట్‌పాత్ అక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పలు దుకాణాలు డబ్బాలతోపాటు, షెడ్లు పాక్షికంగా తొలగించారు.

**ఫుట్‌పాత్ అక్రమణలకు డబ్బులు వసూలు :**
రామంతాపూర్ బైపాస్ రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కొందరు దుకాణదారులు ఫుట్‌పాత్‌లు అక్రమించిన వారి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. స్థానికంగా ఉంటున్న కొందరు బడా నేతలు దుకాణాల ముందు ప్రతి నెలా రూ.12 నుంచి 20 వేల వరకు డబ్బులు వసూలు చేసినట్లు పలువురు బాధితులు అధికారులముందు వాపోయారు. దీనిపై అధికారులు విచారణ చేపడుతున్నారు. దుకాణాల ముందు ఎటువంటి షెడ్లు, డబ్బాలు వేసినా తొలగిస్తామని టిపిఎస్ సురేష్ తెలిపారు.

## సర్వే నెంబర్ 74లో ఆక్రమణల తొలగింపు ప్రభుత్వ భూమిని కాపాడిన అధికారులు


ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు

**సరూర్‌నగర్, జూలై 5 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలంలోని బాలాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 74లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను అధికారులు తొలగించారు. ప్రైవేటు భూమికి ఆనుకొని ఉన్న ఈ ప్రభుత్వ భూమిలో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల బాలాపూర్ గ్రామానికే చెందిన పలువురు దళితులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు బాలాపూర్ తహశీల్దార్‌కు వినతి పత్రాలు సమర్పించారు. ఈ నేపథ్యంలో రంగంలో దిగిన రెవెన్యూ సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే నెంబర్ 74 ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన బేస్మెంట్‌లను జెసిబితో కూల్చివేశారు. అంతే కాకుండా సదరు స్థలాన్ని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు పాతారు.

**ఆక్రమణల తొలగింపుపై దళిత నేతల హర్షం**
బాలాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఎఆర్‌సిఐ ప్రహరీగోడకు ఆనుకొని ఉన్న రహదారినుండి బడంగ్‌పేట్ వైపు వెళ్లే రహదారి సమీపంలో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించడంపై గ్రామానికి చెందిన దళిత నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వభూమిని రక్షించాలని ఇటీవల తాము చేసిన వినతికి స్పందించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్, బాలాపూర్ ఎమ్మార్వోలు చర్యలు తీసుకోవడంపట్ల కృతజ్ఞతలు తెలిపారు. అక్రమంగా నిర్మించిన బేస్మెంట్‌లను కూల్చివేసి అక్కడ బోర్డులు పాతి కోట్లాది రూపాయాల ప్రభుత్వ భూమిని రక్షించినందుకు గడ్డం వెంకటేశ్ తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించండి : ఆకుల


కాలనీవాసులతో మార్నింగ్ వాక్ చేస్తున్న శ్రీవాణి అంజన్‌కుమార్

**ఎల్.బి.నగర్, జులై 5 ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కరించే విధంగా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో శుక్రవారం జిహెచ్ఎంసి, జలమండలి అధికారులతో కలిసి పలు సమస్యలను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని వెంటనే బాగు చేయాలని సూచించారు. వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వెంకటేశ్వరకాలనీ అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో పరిశుద్ధ విభాగం డిఈ నీలిమ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది బుచ్చయ్య, సూర్య, పూజ, ప్రవీణ్, శంకర్, రాంబాబు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ఏరియా ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆకస్మిక తనిఖీ


ఉప్పల్, మల్కాజిగిరి ఆరోగ్య కేంద్రాలలో అకస్మిక తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్ తదితరులు

**మల్కాజిగిరి, జులై 5 ప్రభాతవార్త :** వివిధ సమస్యలతో ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు వెంటనే మెరుగైన చికిత్స అందించే విధంగా డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. శుక్రవారం ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మల్కాజిగిరి ఏరియా హాస్పటల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను, ప్రతి ఓపిలను, ల్యాబ్, ఐసియూ యూనిట్, ఆక్సిజన్ యూనిట్, ఎక్స్‌రే, ప్రసూతి రూమ్, ప్రత్యేక నవజాత శిశు కేంద్రం సునిశితంగా పరిశీలించి అక్కడ పరిస్థితులు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్య సదుపాయాల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట వైద్య పరికరాలు సమకూర్చుకోవాలని సూచించారు. ఆసుపత్రులలో వైద్య పరీక్షల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ సంఖ్య మరింత పెరిగేలా చూడాలన్నారు. హై రిస్క్ ఉన్న కేసులను గుర్తించి గాంధీ,కోటి హాస్పిటల్ కు రిఫర్ చేయాలన్నారు. ప్రతిరోజు ఆసుపత్రికి ఎంతమంది పేషెంట్లు వస్తారని పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలతో వచ్చే పేషెంట్లకు వెంటనే మెరుగైన చికిత్స అందించే విధంగా డాక్టర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా డిఎం అండ్ హెచ్ఓ రఘునాథస్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డిసిహెచ్ కోటియానాయక్, సౌందర్యలత, మల్కాజిగిరి డిఎం అండ్ హెచ్‌వో ఆనంద్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్ఎంఓ సునీత, సంగీత్, పద్మావతి, సంధ్యారాణి, గీతా, చంద్రకళ ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు తనవంతు చేయూత : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


బాధితులకు ఎల్ఓసి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 5 ప్రభాతవార్త :** అర్హులైన నిరుపేదల ఇంటి వద్దకే వెళ్లి ఎల్ఓసి పత్రాలు అందజేస్తున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ సరస్వతినగర్ కాలనీకి చెందిన మల్లేష్ కుమారుడు తనుష్ చెవికి సంబంధించిన సమస్యతో ఇబ్బందిపడుతున్న విషయం తెలుసుకుని అతనికి రూ.5లక్షల ఎల్ఓసి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఉప్పల్ నియోకజవర్గం అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. అర్హులైన పేదలకు చేయూత అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఆకుల మహేందర్, మేకల మధుసూధన్‌రెడ్డి, మేకల మేఘమాల, జెట్ట కిషోర్, సుక్క కిరణ్, నిరంజన్‌చారి, శ్రీనివాసాచారి, పంగ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న సంఘం నాయకులు

**సైదాబాద్, జులై 5 ప్రభాతవార్త:** అమావాస్య సందర్భంగా చంపాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారంనచంపాపేటలోని సంఘం కార్యాలయం వద్ద అన్నదానం నిర్వహించారు. అనంతరం దాతలను కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి బిల్లకంటి కిరణ్ కుమార్ గుప్తా, చంపాపేట ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్ గుప్తా, అన్నదాన కమిటీ కన్వీనర్ విజయ్ నాథ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరె రవీందర్ గుప్తా, సంయుక్త కార్యదర్శి మధుసూధన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

**మలక్‌పేట, జులై 5 ప్రభాతవార్త :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని పి.డి.ఎస్.యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంద నవీన్, పొడపంగి నాగరాజు. అన్నారు. ఈ నెల 6వ తేదీన సంగారెడ్డిలో జరిగే పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని దిల్‌సుక్‌నగర్‌లో గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి అణగారిన వర్గాల విద్యార్థులకు విద్యను అందకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్ళ కాలంలో కెసిఆర్ ప్రభుత్వం ప్రధానంగా విద్యారంగాన్ని కోలుకోలేని విధంగా ధ్వంసం చేసిందని, యూనివర్సిటీలను పూర్తిస్థాయిలో నిర్లక్ష్యానికి గురిచేసిందని, యూనివర్సిటీలకు వీసీలను, నియమించకుండా నిర్లక్ష్యాన్ని చేసిందని సగానికి సగం ప్రొఫెసర్, లెక్చరర్, ఇతర సిబ్బంది పోస్టులను ఏళ్ల తరబడి భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగాన్ని బలోపేతంచేసే దిశగా నూతనప్రభుత్వం దృష్టి సారించాలని అందుకు విద్యార్థులు తన భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుటకు జనరల్ కౌన్సిల్లో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధు, రమేష్, హర్ష, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


సౌత్ ఈస్ట్ జోన్ డిసిపిగా బాధ్యతలు చేపట్టిన పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను సన్మానిస్తున్న టిపిసిసి కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ చిత్రంలో నాయకులు చందు, కోట్ల లడ్డు పటేల్ తదితరులు (ప్రభాతవార్త, సైదాబాద్)